RNI No. APTEL/2010/ 36692 AKSHARA PRAKASAM aksharaprakasam@gmaiil.com

అక్షర ప్రకాశం

Published From Prakasam People News Paper

సంపుటి : 15 సంచిక : 319 అక్టోబర్ 9 శుక్రవారం 2026 ప్రకాశం పేజీలు : 4 వెల - 2

ఏపీలో పెట్టుబడులే లక్ష్యం..

ఎంఓయూలను సాకారం చేస్తాం



ఢిల్లీ, అక్టోబర్ 8 : ఢిల్లీలో జరుగుతున్న సీఐఐ భాగస్వామ్య సదస్సుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హాజరయ్యారు. కేంద్ర మంత్రి పీయూష్ గోయెల్‌తో కలిసి ఈ సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏపీకి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని సీఐఐ సదస్సులో ముఖ్యమంత్రి ప్రముఖంగా ప్రస్తావించారు. ఎంఓయూలను సాకారం చేసే అంశంపై ఎక్కువ దృష్టిసారించామని పారిశ్రామికవేత్తలకు వెల్లడించారు. పారిశ్రామిక ప్రోత్సాహకాలను త్వరలో ప్రారంభించనున్నట్టు స్పష్టం చేశారు. బిల్డ్ ఏపీ నినాదంతో పని చేస్తున్నామని ప్రకటించారు.

ప్రధాని పాత్ర అత్యద్భుతం..

25 ఏళ్లుగా నిరంతరాయ ప్రజాసేవలో ఉన్న ప్రధాని మోదీకి సీఎం శుభాకాంక్షలు తెలిపారు. డిజిటల్ ఇన్‌ఫ్రాను దేశంలో తీసుకురావటంలో ప్రధాని మోదీది కీలక పాత్ర అని చెప్పుకొచ్చారు. అత్యద్భుతమైన రోడ్ నెట్‌వర్క్ కలిగిన భారత్ ప్రపంచంలోనే రెండో స్థానంలో ఉందన్నారు. రైల్వే నెట్‌వర్క్‌లోనూ దేశం కీలక స్థానంలో ఉందని తెలిపారు. పోర్టులు, ఎయిర్ పోర్టులు, రైల్వే, రోడ్ నెట్‌వర్క్ కలిగి ఉన్న బలమైన దేశాన్ని ప్రధాని తీర్చిదిద్దుతున్నారని వివరించారు. రక్షణ పరంగా అత్యంత భద్రత కలిగిన దేశంగా భారత్‌ను తీర్చిదిద్దడంలో ప్రధాని పాత్ర అత్యద్భుతమని కొనియాడారు.

బిల్డ్ ఏపీ నినాదంతో..

టెక్నాలజీని అందిపుచ్చుకోవటంలో కీలకంగా ఉన్న భారతీయులు ప్రపంచవ్యాప్తంగా వివిధ కంపెనీలకు సారథ్యం వహిస్తున్నారని చంద్రబాబు తెలిపారు. ఏపీకి చేయూత ఇవ్వటంలో కేంద్రం, ప్రధాని మోదీ ముందున్నారని అన్నారు. పోలవరం, అమరావతి రాజధాని ప్రాజెక్టులతో పాటు వేర్వేరు ప్రాజెక్టులకు ఆర్థిక సహకారం అందిస్తున్నారని చెప్పారు. విశాఖ సహా వివిధ ప్రాంతాల్లో సెమీ కండక్టర్ యూనిట్ల ఏర్పాటుకు కేంద్రం ఆమోదం తెలిపిందన్నారు. బిల్డ్ ఏపీ అనే నినాదంతో పని చేస్తున్నామని చెప్పారు. ఏపీలో సంపద సృష్టించటంతో పాటు పెద్ద ఎత్తున ఉద్యోగాల కల్పన చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని వెల్లడించారు. గతేడాది నిర్వహించిన భాగస్వామ్య సదస్సులో రూ.13.50 లక్షల కోట్ల ఒప్పందాలు జరిగాయని.. గడచిన 28 నెలల్లో రూ.22 లక్షల కోట్ల పెట్టుబడులను సాధించగలిగామని అన్నారు. ఎంఓయూలకు మాత్రమే పరిమితం కావటం లేదని.. వాటిని పెట్టుబడులుగా మలిచేలా కృషి చేస్తున్నామని చెప్పారు.

నదుల అనుసంధానంతో నీటి కొరతే రాదు..

గూగుల్ 1 గిగావాట్ డేటా సెంటర్, ఆర్సెలార్ మిత్తల్ లాంటి ప్రముఖ కంపెనీలు ఏపీకి వచ్చాయని ముఖ్యమంత్రి అన్నారు. గతేడాది ప్రకటించిన మేరకు పారిశ్రామిక ప్రోత్సాహకాలను నవంబరు 12,13 తేదీల్లో ప్రారంభిస్తామని తెలిపారు. పెట్టుబడులకు అడ్డంకిగా ఉన్న నాలా యాక్టును రద్దు చేసేశామని చెప్పారు. గోదావరి, కృష్ణ, పెన్నా, తుంగభద్ర, కావేరి నదులు కలిస్తే ఏపీ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు నీటి కొరతే రాదని వెల్లడించారు. రాయలసీమను గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా తయారు చేయాలని నిర్దేశించుకున్నామని... సౌత్ ఈస్ట్ ఏషియాకు గేట్ వేగా ఏపీని మార్చటమే లక్ష్యమని స్పష్టం చేశారు. దుగరాజపట్నంలో షిప్ బిల్డింగ్ సెంటర్ ఏర్పాటుకు మజగావ్ డాగ్ యార్డ్ లిమిటెడ్ ముందుకు వచ్చిందన్నారు. మచిలీపట్నంలో గోవా షిప్ యార్డు సంస్థ నౌకా నిర్మాణ కేంద్రం ఏర్పాటు చేసేందుకు అంగీకరించిందన్నారు. డ్రోన్, ఎలక్ట్రానిక్స్ క్లస్టర్లను కూడా తిరుపతి, లేపాక్షి, కొప్పర్తిలో ఏర్పాటు చేశామని తెలిపారు.

వాటిని అమలు చేసేందుకు ఏపీ సిద్ధం..

5వ తరం ఫైటర్ జెట్ ప్రాజెక్టును కూడా రక్షణశాఖ రాయలసీమలో ప్రారంభించిందని చంద్రబాబు తెలిపారు. 500 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీలో ఇప్పటికే 110 గిగావాట్ల విద్యుత్ ఉత్పత్తిపై ఒప్పందాలు కుదిరాయని, గ్రీన్ ఎనర్జీ ట్రాన్స్ మిషన్ కారిడార్ ఏర్పాటు చేయాలని ఆలోచిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రగతిలో ఉపయోగపడే ఏ విధానాన్నైనా తక్షణం అమలు చేయడానికి ఏపీ సిద్ధంగా ఉందని ప్రకటించారు. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులను ఏఐ సహా పారిశ్రామిక, వాణిజ్యవేత్తలుగా తయారు చేసేలా పాఠ్యాంశాలను రూపొందిస్తున్నామని తెలిపారు. డ్వాక్రా సంఘాల ఉత్పత్తులను స్వయం బ్రాండ్ పేరుతో అంతర్జాతీయ మార్కెట్లకు ప్రమోట్ చేస్తామన్నారు. డేటా లేక్ లాంటి వ్యవస్థల ద్వారా ఏఐ స్టాక్ లాంటి సాంకేతికతతో వేగంగా నిర్ణయాలు తీసుకోగలుగుతున్నామని తెలిపారు. జీఎస్టీ పన్నుల వసూళ్లలో ఏఐ స్టాక్ అమలు చేయటం ద్వారా రాష్ట్రానికి ఆదాయం గణనీయంగా పెరిగిందన్నారు.

బ్లూ ఎకానమీలో ఏపీ కీలకం..

వ్యవసాయం, పరిశ్రమలు, సేవల రంగాల్లో ఉన్న అపారమైన అవకాశాలను అందిపుచ్చుకునేలా స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అమలు చేస్తున్నామని సీఎం వెల్లడించారు. బ్లూ ఎకానమీలో ఏపీ కీలకంగా ఉందని.. అమరావతిలో క్వాంటం కంప్యూటర్ ఆపరేషన్స్ వచ్చే ఏడాది ఫిబ్రవరి నుంచి మొదలవుతాయన్నారు. అమరావతిలో గ్లోబల్ లీడర్షిప్ సెంటర్ ద్వారా వివిధ రంగాల్లో నాయకత్వాన్ని పెంచేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. విశాఖ లాంటి డెస్టినేషన్లకు చేరుకునేలా భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం అందుబాటులోకి వచ్చిందన్నారు. బాపట్ల లాంటి అద్భుతమైన తీర ప్రాంతాలు ఏపీలో అందుబాటులో ఉన్నాయన్నారు. సీఐఐ భాగస్వామ్య సదస్సుల నిర్వహణ కోసం కేంద్రం అంతర్జాతీయ కన్వెన్షన్ సెంటర్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

మధ్యస్థ కరువు మండలంగా రంగంపేట

రంగంపేట, అక్షర ప్రకాశం : రంగంపేట మండలాన్ని మధ్యస్థ కరువు మండలంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రకటించినట్లుగా మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ మండలంలో చెరువులు, లిఫ్ట్‌ల ద్వారా వరి, మినుములు సాగు చేస్తున్న రైతుల పంటల దిగుబడిపై వివరాలను సేకరిస్తున్నామని, సాధారణ దిగుబడితో పోలిస్తే 33 శాతం కంటే తక్కువ దిగుబడి వచ్చే అవకాశం ఉన్న రైతులు తమ వివరాలను సంబంధిత రైతు సేవా కేంద్రాల్లో సమర్పించాలన్నారు. రైతులు ఆధార్ కార్డు, పొలం పాస్ బుక్, బ్యాంకు ఖాతా వివరాలను రైతు సేవా కేంద్రంలో అందజేయాలని, రైతులు సమర్పించిన వివరాల ఆధారంగా వ్యవసాయ శాఖ సిబ్బంది సంబంధిత పొలాలను పరిశీలించి, పంట పరిస్థితిని అంచనా వేస్తారని కరువు పరిస్థితి ఉన్నట్లు నిర్ధారణ అయిన రైతుల వివరాలను తదుపరి ప్రక్రియలో నమోదు చేస్తామన్నారు.రైతులు తమ వివరాలను అక్టోబర్ 12, 2026లోగా సంబంధిత రైతు సేవా కేంద్రంలో సమర్పించాలని అనంతరం అక్టోబర్ 13, 14, 15 తేదీల్లో సోషల్ ఆడిట్ నిర్వహించి , అక్టోబర్ 16న తుది జాబితాను ప్రదర్శించనున్నట్లుగా వ్యవసాయ శాఖ అధికారులు వెల్లడించారు.రంగంపేట మండలంలోని అర్హులైన రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నిర్ణీత గడువులోగా అవసరమైన పత్రాలను సమర్పించాలని మండల వ్యవసాయ అధికారి కోరారు.

ముఖ్యమంత్రి పర్యటనకు పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు

- ప్రకాశం జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు

జరుగుమల్లి, అక్షర ప్రకాశం : అక్టోబర్ 8 9వ తేదీన మీ భూమి – మీ హక్కు పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ చేయనున్న గౌరవ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు జరుగుమల్లి మండలంలోని నర్సింగోలు గ్రామానికి రానున్న నేపథ్యంలో జిల్లా ఎస్పీ గారు బందోబస్తు విధుల్లో పాల్గొనబోయే పోలీస్ అధికారులకు మరియు సిబ్బందికి బ్రీఫింగ్ నిర్వహించి బందోబస్తు విధులపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ గారు మాట్లాడుతూ ప్రతి సెక్టార్‌కు తగినంత సంఖ్యలో సిబ్బందిని కేటాయించినట్లు తెలిపారు. విధులకు నియమించబడిన అధికారులు, సిబ్బంది తమకు కేటాయించిన పాయింట్ల వద్ద నిర్ణీత సమయానికి హాజరై ముఖ్యమంత్రి గారి పర్యటన పూర్తయ్యే వరకు పూర్తి అప్రమత్తతతో విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. హెలిప్యాడ్ ప్రాంతంలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టడంతో పాటు, ముఖ్యమంత్రి కాన్వాయ్ రాకపోకల సమయంలో సాధారణ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా, ట్రాఫిక్ అంతరాయం లేకుండా అవసరమైన చోట ట్రాఫిక్ మళ్లింపు చర్యలు చేపట్టాలని సూచించారు. సభా ప్రాంగణానికి వచ్చే వీవీఐపీ, వీఐపీ వాహనాలను నిర్దేశించిన పార్కింగ్ స్థలాలకు మళ్లించేలా చర్యలు తీసుకోవాలని, ఇతర వాహనాలు కూడా కేటాయించిన ప్రదేశాల్లో క్రమబద్ధంగా పార్కింగ్ చేయించేలా చూడాలని తెలిపారు. ప్రజలు మరియు కార్యకర్తల ప్రవేశ, నిష్క్రమణను క్రమబద్ధంగా నిర్వహించాలని, సెక్టార్ ఇన్‌చార్జ్ అధికారులు తమ పరిధిలోని సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. భద్రతా పరంగా ఎలాంటి లోపాలు లేకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని, అవసరమైన చోట రోప్ పార్టీలు, రూఫ్ టాప్, స్పెషల్ పార్టీలు, స్ట్రైకింగ్ ఫోర్స్ సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. హెలిప్యాడ్ ప్రాంతం నుంచి రచ్చబండ, ప్రజావేదిక, అనంతరం పార్టీ కార్యకర్తలతో సమావేశం వరకు గౌరవ ముఖ్యమంత్రి గారి పర్యటన ప్రారంభం నుంచి ముగిసే వరకు సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహించాలని సూచించారు. అదేవిధంగా, డ్రోన్ కెమెరాలు, సీసీ కెమెరాల ద్వారా నిరంతర నిఘా కొనసాగించేలా కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విధులు నిర్వహించే సిబ్బంది సమయస్ఫూర్తితో వ్యవహరించాలన్నారు. అనంతరం నర్సింగోలు వద్ద ముఖ్యమంత్రి గారి హెలికాప్టర్ దిగే హెలిప్యాడ్ ప్రాంతం నుండి రచ్చబండ కార్యక్రమం, ప్రజావేదిక మరియు కాన్వాయ్ ట్రయల్ రన్ ను ప్రత్యేకంగా పరిశీలించారు. ముఖ్యమంత్రి గారి కాన్వాయ్ వచ్చేటప్పుడు బందోబస్త్ సిబ్బంది అత్యంత అప్రమత్తంగా ఉండాలని, కాన్వాయ్ వెళ్లే మార్గంలో ఎలాంటి ఆటంకాలు కలగకుండా అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యమంత్రి గారి పర్యటన భద్రత కోసం జిల్లా ఎస్పీ గారి స్వీయ పర్యవేక్షణలో ముగ్గురు అదనపు ఎస్పీలు, 6 మంది డీఎస్పీలు, ఇతర పోలీసు అధికారులతో కలిపి సుమారు 1200 మంది పోలీసు అధికారులు, సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. రోప్ పార్టీలు, స్పెషల్ పార్టీలు, స్ట్రైకింగ్ ఫోర్స్ ను మోహరించి పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు చేపట్టారు.

చెత్త నుంచి సంపద తయారీపై అవగాహనకు ఎక్స్‌ప్లోర్ విజిట్

- ఎం పి డి ఓ బాబురావు

బాపట్ల, అక్షర ప్రకాశం : చెత్తను సమర్థవంతంగా నిర్వహిస్తూ దానిని సంపదగా మార్చే విధానాలపై అవగాహన కల్పించేందుకు బాపట్ల మండలం మలుప్రోలువారి పాలెం గ్రామపంచాయతీలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్ద ఎక్స్‌ప్లోర్ విజిట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పంచాయతీరాజ్ కమిషనర్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి సేకరించే తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి, శాస్త్రీయ పద్ధతుల్లో నిర్వ హించడం ద్వారా వ్యర్థాలను ఉపయోగకరమైన సంపదగా మార్చే విధానాలను కార్యక్రమంలో వివరించారు. ముఖ్యంగా తడి చెత్తను వినియోగించి వర్మీ కంపోస్ట్ ఎరువును తయారు చేసే ప్రక్రియపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బాపట్ల మండలంలోని అన్ని గ్రామపంచాయతీల పంచాయతీ అభివృద్ధి అధికారు లు, హరిత రాయబారులు పాల్గొన్నారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్వహణ, తడి చెత్తను సమర్థవంతంగా వినియోగించడం, వర్మీ కంపోస్ట్ తయారీ వంటి అంశాలపై వారికి పలు సూచనలు అందజేశారు. ప్రతి గ్రామపంచాయతీలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో నెలకు కనీసం ఒక టన్ను వర్మీ కంపోస్ట్ ఎరువును తయారు చేసేలా లక్ష్యాన్ని నిర్దేశించుకుని పనిచేయాలని సూచించారు. గ్రామాల్లో చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా ఇంటి వద్దనే తడి, పొడి చెత్తను వేరు చేసి పారిశుద్ధ్య సిబ్బందికి అందించేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ సంద ర్భంగా మండల పరిషత్ అభివృద్ధి అధికారి బాబురావు మాట్లాడుతూ, "స్వచ్ఛ ఆంధ్ర – స్వర్ణ ఆంధ్ర" లక్ష్య సాధనలో భాగంగా ప్రతి గ్రామపంచాయతీలో చెత్తను సంపదగా మార్చే ప్రక్రియను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. వర్మీ కంపోస్ట్ తయారీ ద్వారా గ్రామపంచాయతీలకు అదనపు ఆదాయం సమకూరడంతో పాటు గ్రామాల్లో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచవచ్చని తెలిపారు. సేంద్రియ ఎరువుల వినియోగాన్ని ప్రోత్సహించడం ద్వారా రైతులకు కూడా ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు. మలుప్రోలువారిపాలెం గ్రామపంచాయతీ అభివృద్ధి అధికారి గాయత్రి సమన్వయంతో కార్యక్రమం నిర్వహించారు. ఉప మండల పరిషత్ అభివృద్ధి అధికారి రామకృష్ణతో పాటు మండలంలోని పంచాయతీ అభివృద్ధి అధికారులు, హరిత రాయబారులు పాల్గొన్నారు.

అక్షర ప్రకాశం
శుక్రవారం 9 - 10 - 2026

జగన్ పాలనలో ప్రజారోగ్యం గాల్లో దీపంలా మారింది : ప్రత్తిపాటి

● ప్రజలు అభివృద్ధిని మర్చిపోయి.. దుర్మార్గాలు, అరాచకాలు, అవినీతి మధ్య బిక్కుబిక్కుమంటూ కాలం గడిపారు. ● కూటమి ప్రభుత్వం వచ్చాకే ప్రజలు నిజమైన అభివృద్ధి, సంక్షేమం చూస్తున్నారు. ● చంద్రబాబు పాలనలో ప్రజలకు కొరత లేకుండా సంక్షేమం. ● ప్రజలు ప్రభుత్వాసుపత్రులపై నమ్మకం ఉంచాలి. ● ప్రజారోగ్య రక్షణకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోంది. ● వైద్యులు, వైద్యసేవల పనితీరుపై నిత్యం ర్యాంకులు ఇస్తూ, ప్రజాసేవల్లో జవాబుదారీతనం పెంచుతోంది. ● రూ.1.45 కోట్లతో నిర్మించనున్న అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ కు శంకుస్థాపన చేసిన ప్రత్తిపాటి. ● పలు వార్డుల్లో రూ.60.50 లక్షలతో నిర్మించనున్న సీసీరోడ్లు, కమ్యూనిటీ హాల్ కు భూమిపూజ చేసిన ఎమ్మెల్యే.

రూ. 60.50 లక్షలతో నిర్మించే సీసీరోడ్లు, కమ్యూనిటీ హాల్ కు శంకుస్థాపన

అక్షర ప్రకాశం : జగన్ పాలనలో ప్రజలు అభివృద్ధిని మర్చిపోయి... దుర్మార్గాలు, అరాచకాలు, అవినీతి మధ్య బిక్కుబిక్కుమంటూ కాలం గడిపారని, 2024 ఎన్నికల్లో ప్రజా ప్రభుత్వం ఏర్పడ్డాకే వారికి నిజమైన స్వేచ్ఛ లభించిందని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. గురువారం ఆయన పట్టణంలో పలు వార్డుల్లో పర్యటించి అనేక అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. తొలుత స్థానిక 8వ వార్డులోని రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద పాత ప్రభుత్వాసుపత్రి ప్రాంగణంలో రూ. 1.45 కోట్లతోనిర్మించే అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ కు ప్రత్తిపాటి శంకుస్థాపన చేశారు. అనంతరం 8, 7, 6 వార్డుల్లో రూ. 60.50 లక్షలతో నిర్మించనున్న ఒక కమ్యూనిటీ హాల్, సీసీరోడ్ల నిర్మాణానికి స్థానిక నాయకులతో కలిసి భూమిపూజ చేశారు. ప్రైమరీ హెల్త్ సెంటర్ కు శంకుస్థాపన అనంతరం ప్రత్తిపాటి విలేకరులతో మాట్లాడారు.

జగన్ పాలనలో ప్రజలు అభివృద్ధిని మర్చిపోయారు..

జగన్ హయాంలో ప్రజారోగ్యం గాల్లో దీపంలా మారిందని, అసలు రాష్ట్రంలో ఎక్కడా అభివృద్ధి ఆనవాళ్లు కనిపించలేదని, ప్రజలు కూడా పూర్తిగా అభివృద్ధిని మర్చిపోయారని ప్రత్తిపాటి పేర్కొన్నారు. చంద్రబాబు పాలనలోనే నవ్యాంధ్రప్రదేశ్ అభివృద్ధి బాటపట్టిందని, ప్రజలకు కొరత లేకుండా సంక్షేమపథకాలు అందుతున్నాయని ప్రత్తిపాటి తెలిపారు. ప్రజల ఆరోగ్య రక్షణకు కూటమిప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని, దానిలో భాగంగానే నియోజకవర్గ ప్రజలకోసం శిథిలమైన ప్రభుత్వాసుపత్రి స్థానంలో అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ నిర్మాణానికి శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. ప్రజలకు మెరుగైన, నాణ్యమైన ఉచిత వైద్యసేవలు అందించాలన్న లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని, అందుకోసం బడ్జెట్లో ఎక్కువ నిధులు కేటాయించిందని ప్రత్తిపాటి చెప్పారు. ప్రభుత్వం ప్రజారోగ్యానికి కోట్ల రూపాయలు వెచ్చిస్తోందని, వైద్యసేవలు, వైద్యుల పనితీరుపై నిత్యం ర్యాంకులు విడుదల చేస్తోందన్నారు. ప్రజా సేవల విషయంలో ప్రభుత్వ వైద్యులు, వైద్యేతర సిబ్బందిలో జవాబుదారీతనం పెంచుతోందన్నారు. జనన మరణాల రేటుపై ప్రత్యేక దృష్టి పెట్టిన కూటమి ప్రభుత్వం, తల్లీబిడ్డల ఆరోగ్య రక్షణకు అధిక ప్రాధాన్యమిస్తూ, ప్రభుత్వాసుపత్రుల్లో పారిశుధ్య నిర్వహణను మెరుగుపరిచిందన్నారు. ప్రజలు కూడా ప్రభుత్వాసుపత్రులపై నమ్మకం ఉంచాలని, ప్రైవేట్ ఆసుపత్రుల్ని ఆశ్రయించి అప్పులపాలై వారు ఇబ్బందులు పడకూడదన్నదే ప్రభుత్వ ఆలోచన అని ప్రత్తిపాటి చెప్పారు.

ఇటీవల ప్రభుత్వం నుంచి పట్టణాభివృద్ధికి మంజూరైన రూ. 52 కోట్ల నిధులతో ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు శ్రీకారం చుట్టామని, దానిలో భాగంగా నేడు పలువార్డుల్లో రూ. 60.50 లక్షలతో నిర్మించనున్న సీసీరోడ్లు, కమ్యూనిటీ హాల్ కు శంకుస్థాపన చేయడం జరిగిందని ప్రత్తిపాటి పేర్కొన్నారు. త్వరలో జరిగే స్థానిక ఎన్నికల్లో ప్రజలు కూటమి అభ్యర్థుల్నే గెలిపిస్తారని, రాష్ట్ర పతనాన్ని కోరుకునే వైసీపీకి మరోసారి గట్టిగా బుద్ధి చెబుతారని ప్రత్తిపాటి స్పష్టం చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ కరిముల్లా, పట్టణ అధ్యక్షులు పఠాన్ సమద్ ఖాన్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ తేళ్ల సుబ్బారావు, మున్సిపల్ మాజీ చైర్మన్ షేక్ రఫాని, పట్టణ ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, రాష్ట్ర డైరెక్టర్ కందుల రమణ, బీజేపీ నాయకులు మల్లెల శివనాగేశ్వరరావు, నెల్లూరి రంజిత్, కూటమి నాయకులు రావు సుబ్రమణ్యం, టీడీపీ నాయకులు జమాల్ భాష, ముల్లా కరిముల్లా, మద్దిబోయిన శివ, కొత్త కోటేశ్వరరావు, మురకొండ మల్లిబాబు, కంచర్ల శ్రీనివాసరావు , పిల్లి కోటేశ్వరరావు, షేక్ బాజీ, కొత్త కుమారి, గోపిదేశి గంగాధర్, గుధే వెంకట్రావు, జహంగీర్, బషీర్, గొట్టిపాటి బాబు, ఉప్పలపాటి సురేష్, షేక్ సుభాని, ఎస్.యం.ఎస్ సుభాని, తిరుపతయ్య, ఆరే మల్లి, చోటు సుభాని, డాక్టర్లు డి.యం.యాచ్.ఓ. చుక్కా రత్న మన్మోహన్, డి.ఈ అబ్దుల్ రహీమ్, అధికారులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చిలకలూరిపేట లో కారు బీభత్సం: మద్యం మత్తులో ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొన్న వైనం



చిలకలూరిపేట, అక్షర ప్రకాశం : చిలకలూరిపేట పట్టణంలో మద్యం మత్తులో ఉన్న వ్యక్తులు కారుతో బీభత్సం సృష్టించారు. స్థానిక పండరీపురం వాటర్ ట్యాంక్ ఎదురు బజార్‌లో మితిమీరిన వేగంతో కారు నడుపుతూ ఓ వ్యక్తిని బలంగా ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ఆ వ్యక్తి చేయి విరిగింది. అనంతరం కారును నియంత్రించలేక అదే వేగంతో వెళ్లి పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మను బలంగా ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం పూర్తిగా నుజ్జునుజ్జయ్యింది. అయితే, సమయానికి కారులోని ఎయిర్ బ్యాగులు తెరుచుకోవడంతో అందులో ఉన్న ఇద్దరు వ్యక్తులు ఎలాంటి ప్రాణాపాయం, గాయాలు లేకుండా సురక్షితంగా బయటపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

తూబాడులో పోలీసుల ఆకస్మిక కార్డన్ సెర్చ్: 30 వాహనాలు సీజ్

చిలకలూరిపేట, అక్షర ప్రకాశం : పల్నాడు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు నాదెండ్ల మండలం తూబాడు గ్రామంలో పోలీసులు గురువారం విస్తృతంగా 'కార్డన్ అండ్ సెర్చ్' నిర్వహించారు. డీఎస్పీ హనుమంతరావు పర్యవేక్షణలో సుమారు 100 మంది పోలీసు సిబ్బందితో గ్రామంలోకి ప్రవేశించి ఆకస్మిక తనిఖీలు చేపట్టారు.

ఈ తనిఖీల్లో భాగంగా గ్రామంలోని పలు ఇళ్లతో పాటు అనుమానాస్పద ప్రాంతాలను పోలీసులు జల్లెడ పట్టారు. వాహనాల ధ్రువపత్రాలను కూలంకషంగా పరిశీలించిన పోలీసులు, సరైన పత్రాలు లేని 28 ద్విచక్ర వాహనాలు, 2 ఆటోలను స్వాధీనం చేసుకుని, మొత్తం 30 వాహనాలను సీజ్ చేశారు.

డిమాండ్లు పరిష్కరించే వరకు ఆరోగ్యశాఖ కాంట్రాక్టు ఉద్యోగుల ధర్నా

- వెనక్కి తగ్గే ప్రసక్తే లేదు: కాంట్రాక్టు ఉద్యోగుల జేపీసీ సభ్యుడు సత్యంరాజు

బాపట్ల, అక్షర ప్రకాశం : మూడో రోజుకు చేరిన నిరసన.. ఉద్యోగులకు పలు సంఘాల సంఘీభావం.ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బాపట్ల జిల్లా ఆరోగ్యశాఖ కాంట్రాక్టు ఉద్యోగులు చేపట్టిన నిరసన కార్యక్రమం మూడో రోజుకు చేరింది. బాపట్లలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయం వెలుపల కాంట్రాక్టు ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని ధర్నా నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలు, ఆరోగ్య కేంద్రాల నుంచి వచ్చిన కాంట్రాక్టు పారామెడికల్ ఉద్యోగులు ప్లకార్డులు చేతబూని తమ డిమాండ్లను నెరవేర్చాలని నినాదాలు చేశారు. యుగళ గీతాలతో నిరసన వ్యక్తం చేస్తూ ప్రభుత్వ దృష్టికి తమ సమస్యలను తీసుకెళ్లారు. ఈ సందర్భంగా నిండు గర్భవతి వెంకటనరసమ్మ, ఇద్దరు చిన్నపిల్లలతో జ్యోతి అనే సిబ్బంది ధర్నాలో కూర్చోవడం పలువురిని ఆకట్టుకుంది. కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యల తీవ్రతను తెలియజేసేలా వారి పరిస్థితి ఉందని పలువురు పేర్కొన్నారు. కాంట్రాక్టు ఆరోగ్యశాఖ ఉద్యోగుల ఆందోళనకు పలు ఉద్యోగ, కార్మిక సంఘాలు మద్దతు ప్రకటించాయి. గతంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వేతర ఉద్యోగుల సంఘం, కార్మిక సంఘం, ఆంధ్రప్రదేశ్ హంస సంఘం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఇంజినీరింగ్ ఉద్యోగుల సంఘం, భారత జాతీయ కార్మిక కాంగ్రెస్ సంఘాలు మద్దతు తెలిపాయి. తాజాగా ఆర్టీసీ కార్మికుల సంఘం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం, కార్మిక సంఘం ప్రతినిధులు ధర్నా కార్యక్రమానికి హాజరై కాంట్రాక్టు ఉద్యోగులకు సంఘీభావం తెలిపారు. హంస సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అరవ పాల్, భారత జాతీయ కార్మిక కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కారరావు ఫోన్ ద్వారా తమ మద్దతును ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం బాపట్ల జిల్లా అధ్యక్షుడు రాఘవరెడ్డి, కార్యదర్శి రవికుమార్‌తో పాటు సంఘ సభ్యులు, బాపట్ల జిల్లా ఆర్టీసీ కార్మికుల జిల్లా అధ్యక్షుడు జి. సత్యనారాయణ, కార్యదర్శి బి. తిరుమలరెడ్డి, ఆర్టీసీ డిపో కార్మికుడు ఎస్. యోగానంద్ ధర్నా కార్యక్రమానికి హాజరై సంఘీభావం తెలిపారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి

- రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్రపునీఠా ఆదేశం

బాపట్ల, అక్షర ప్రకాశం : గ్రామపంచాయతీ, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు అవసరమైన ముందస్తు ఏర్పాట్లను పూర్తి చేసి సిద్ధంగా ఉండాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్రపునీఠా జిల్లా కలెక్టర్లు, ఎస్పీలను ఆదేశించారు. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై గురువారం రాష్ట్ర రాజధాని నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో ఆయన వీక్షణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన నాటి నుంచి 14 రోజుల్లో ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంటుందని తెలిపారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల ప్రక్రియను 16 రోజుల్లో పూర్తి చేయాలని సూచించారు. మున్సిపాలిటీల్లోనూ నిర్దేశించిన గడువులోగా ఎన్నికలను పూర్తి చేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. నగర పంచాయతీలు, జిల్లా పరిషత్, మున్సిపాలిటీల్లో వైస్ చైర్మన్ ఎన్నికలు నూతనంగా జరగనున్న నేపథ్యంలో తాజాగా విడుదలైన మార్గదర్శకాలను పక్కాగా అమలు చేయాలని ఆదేశించారు. ఎన్నికలకు అవసరమైన సామగ్రిలో కొంత భాగాన్ని రాష్ట్ర ప్రభుత్వం నుంచి పంపిస్తామని, మిగిలిన సామగ్రిని జిల్లాల స్థాయిలోనే కొనుగోలు చేసుకోవాలని సూచించారు. సమస్యాత్మక, తీవ్ర సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను ముందుగానే గుర్తించి, వాటికి అనుగుణంగా పోలీసు బందోబస్తు, భద్రతా చర్యలపై ప్రణాళికలు రూపొందించుకోవాలని తెలిపారు. గ్రామపంచాయతీ ఎన్నికలు మూడు దశల్లో నిర్వహించనున్నట్లు అనిల్ చంద్రపునీఠా తెలిపారు. ప్రతి దశలో వెబ్‌కాస్టింగ్ పక్కాగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కంట్రోల్ రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాలను ముందుగానే గుర్తించాలని, స్ట్రాంగ్ రూమ్‌ల విషయంలో నిర్దేశిత ప్రోటోకాల్‌ను తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. శాంతిభద్రతల పరిరక్షణకు కలెక్టర్లు, ఎస్పీలు నిరంతరం పర్యవేక్షణ చేయాలని సూచించారు. అవసరాన్ని బట్టి జోనల్ అధికారులను నియమించుకోవాలని కలెక్టర్లకు సూచించారు.

లయన్స్ సిటిజన్స్ ఆధ్వర్యంలో నేత్ర వైద్య శిబిరం

- 850 మంది విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు

ఒంగోలు, అక్షర ప్రకాశం : ప్రపంచ నేత్ర దినోత్సవము పురస్కరించుకుని లయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ పిలుపు మేరకు లయన్స్ సిటిజన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రత్యేక కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. “విజన్” కార్యక్రమంలో భాగంగా అక్టోబర్ 8 నుండి 18 వరకు పది రోజుల పాటు నిర్వహించే ఈ నేత్ర సంరక్షణ ఉద్యమంలో భాగంగా, స్థానిక మాంటిస్సోరి హై స్కూల్‌లో విద్యార్థులకు ఉచిత నేత్ర పరీక్షలు చేపట్టారు. దుర్గా కంటి ఆసుపత్రి సౌజన్యంతో నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో ఆ పాఠశాలకు చెందిన 850 మంది విద్యార్థులు ఉచితంగా కంటి పరీక్షలు చేయించుకుని, వైద్య సేవలను వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా లయన్స్ సిటిజన్స్ అధ్యక్షులు లయన్ మామిడాల గిరినాథ్ మాట్లాడుతూ... చూపు మానవాళికి ప్రకృతి ఇచ్చిన అమూల్యమైన వరమని, విద్యార్థి దశ నుంచే కంటి చూపుపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. నేటి డిజిటల్ యుగంలో పిల్లలు స్క్రీన్ల ముందు ఎక్కువ సమయం గడపడం వల్ల కంటి సమస్యలు తలెత్తుతున్నాయని, అందుకే క్రమం తప్పకుండా నేత్ర పరీక్షలు చేయించుకోవడం అవసరమని సూచించారు. కార్యదర్శి కసిబిసి నాగేశ్వర రావు మాట్లాడుతూ అక్టోబర్ 8 నుండి 18 వరకు నిర్వహించే ఈ “విజన్” డ్రైవ్ ద్వారా సమాజంలోని వివిధ వర్గాల ప్రజలకు, విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా సేవలు అందిస్తామని వెల్లడించారు. మాంటిస్సోరి విద్యా సంస్థల ప్రతినిధులు ప్రకాష్, డీవీ రాఘవ, పాఠశాల ప్రిన్సిపాల్ నూరుద్దీన్, లయన్స్ క్లబ్ సభ్యులు, మరియు దుర్గా కంటి ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

భూ వివాదాల పరిష్కారం కొరకే పాస్ పుస్తకాల పంపిణీ ఎమ్మెల్యే నల్లమిల్లి

రంగంపేట, అక్షర ప్రకాశం : గత ప్రభుత్వ హయాంలో తన ఆస్తి మనకిస్తున్నట్లుగా జగన్మోహన్ రెడ్డి ఫోటోలతో పాస్ పుస్తకాలు పంపిణీ చేస్తే రైతాంగం పలు ఇబ్బందులకు గురయ్యారని అనపర్తి నియోజకవర్గం శాసనసభ్యులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని దొంతమూరు గ్రామంలో మండల తాసిల్దార్ పాపారావు అధ్యక్షతన పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. పక్క నియోజకవర్గమైన మండపేట రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు వచ్చినప్పుడు ఈ యొక్క సమస్యపై రైతాంగం ఆయనకు వివరించగా తప్పులు సరిచేసి ప్రతి ఒక్కరికి రాజముద్రతో పాస్ పుస్తకం అందించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఆ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రివర్యులు కొణిదెల పవన్ కళ్యాణ్ దీనిపై పరిశీలించి దశల వారీగా పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీకి చర్యలు చేపట్టారన్నారు. దానిలో భాగంగా తొలిసారిగా రంగంపేట మండలం దొంతమూరులో 410 సర్వే నెంబర్లు లో గల 33 వందల ఎకరాలకు చెందిన 1290 మంది రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు ఇవ్వడం జరుగుతుందని ఆయన తెలిపారు.

Published by : Byrapuneni Srinivasarao, Door No.2-25, Vinodarayanipalem (v), Ammanabrolu (Post), N.G.Padu Mandal, Prakasam Dist. A.P. , Printed by : Nannuri Subba Rao, Trunk Road, Ongole Town & Mandal, Prakasam Dist, A.P. - 523001, Printed at : Vijaya Printers (offset Printing), Trunk Road, Ongole Town & Mandal, Prakasam Dist, A.P. - 523001, Published from : Door No.2-25, Vinodarayanipalem (v), Ammanabrolu (Post), N.G.Padu Mandal, Prakasam Dist. A.P. Editor : Byrapuneni Srinivasarao, Door No.2-25, Vinodarayanipalem (v), Ammanabrolu (Post), N.G.Padu Mandal, Prakasam Dist. A.P. Cell : 9848997263, E.mail : aksharaprakasam@gmail.com,